## 198. మూర్ఖ వ్యాపారి

ఒక గురువు తన శిష్యుడ్ని ఇలా అడిగాడు.

"ఈ ప్రపంచంలో అత్యంత మూర్ఖుడైన వ్యాపారి ఎవరో చెప్పగలవా?"

శిష్యుడు కొద్దిసేపు ఆలోచించాడు. తన ఆ ప్రశ్నకి జవాబు కనుక్కోలేనని తెలుసుకున్నాడు.

"స్వామీ. తెలియడం లేదు. మీరే జవాబు చెప్పండి."

"ఈ ప్రపంచంలోకెల్లా అత్యంత మూర్ఖుడైన వ్యాపారి నీ గురువే." చెప్పాడు గురువు.

"అదేమిటి స్వామీ! మీరా?"

"అవును. తను ఇచ్చేదానికి సామానమైన విలువగలదేదీ శిష్యులు ఇవ్వలేరని తెలిసీ, గురువు తన దగ్గరున్న జ్ఞానాన్నంతా తన శిష్యులకి ధార పోస్తాడు. ఇంతకంటే మూర్ఖుడైన వ్యాపారి ఇంకొకరెవరైనా ఉంటారా?" నవ్వుతూ అడిగాడు గురువు.

"మీకు మూర్ఖత్వంగా కనిపించేదంతా నిజానికి గురువులకి శిష్యుల మీద గల అపారమైన కరుణే స్వామీ." చేతులు జోడించి తల వంచి గద్గదంగా చెప్పాడా శిష్యుడు.

## 199. గంగా స్నానం

కాశీరామ్ అనే చెప్పులు కుట్టేవాడు గంగా స్నానం చేయాలని ముప్ఫై ఏళ్ళుగా పైసా పైసా కూడబెట్టాడు. ఓ జట్టుతో కలిసి చివరికి కాశీకి ప్రయాణమయ్యాడు. తీరా ప్రయాణం రోజు విరమించుకున్నాడు.

ఆ జట్టు వాళ్ళకి కాశీలో ఎప్పుడు గంగా స్నానానికి వెళ్ళినా, స్నానం చేసుకుని వెళ్ళే కాశీరామ్ కనపడసాగాడు.